నమస్తే తెలంగాణ
నిజామాబాద్, సోమవారం 12 ఆగస్టు 2024
MONDAY, AUGUST 12, 2024

## ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన



నస్రుల్లాబాద్‌లో రోడ్డుపై ధర్నా చేస్తున్న నాయకులు

నస్రుల్లాబాద్, ఆగస్టు 11 : మండల కేంద్రంలో ఆదివారం ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ బాన్సువాడ-బోధన్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రామ మందిరం ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి నాయకుడు ఈశ్వర్ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణపై 341 ఆర్టికల్ విరుద్ధంగా తీర్పు ఇచ్చిందన్నారు. ఆ తీర్పు పైన రివ్యూ పిటిషన్ వేస్తామన్నారు. రాష్ట్రంలో బిల్లు పెట్టనివ్వకుండా అడ్డుకుంటామని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మామిడి భూమయ్య, ఉల్లెంగ కిరణ్, బంగారు మైశయ్య, హరిప్రసాద్, రెడ్డి శ్రీను, నర్సింహులు, బ్యాగరి శ్రీను, శ్రావణ్, పోశెట్టి పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు



కొయ్యగుట్ట వద్ద కొనసాగుతున్న కల్వర్టు నిర్మాణ పనులు

బాన్సువాడ రూరల్, ఆగస్టు 11 : హైదరాబాద్ -మెదక్ - బోధన్ జాతీయ రహదారి విస్తరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. బాన్సువాడ మండలం కొయ్యగుట్ట వద్ద కల్వర్టు నిర్మాణ పనులు చేపడుతున్నారు. రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 50 ఫీట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. హైదరాబాద్ నుంచి బోధన్ వరకు రెండు ప్యాకేజీలుగా విభజించి దాదాపు రూ.900 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్ల తొలగింపు, పైప్ లైన్ షిఫ్టింగ్, కల్వర్టుల నిర్మాణం పనులను ముందుగా ప్రారంభించారు.

## రోడ్డుకు మరమ్మతులు చేయండి



బీబీపేటలో అధ్వాన్నంగా మారిన రోడ్డు

బీబీపేట్, ఆగస్టు 11 : మండల కేంద్రంలోని తహసీల్, సొసైటీ, ప్రభుత్వ దవాఖానకు వెళ్లే వారికి ఇదొక్కటే దారి. ఈ రోడ్డులో గుంతలు ఏర్పడిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ గుంతల్లో నీరు నిలిచాయి. దీంతో కార్యాయాలు, దవాఖానకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాలకు వెళ్లే అధికారులు కూడా ఈ రోడ్డుపై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డుపై సీసీ వేయించాలని దవాఖాన, కార్యాలయాలకు వెళ్లే ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించినా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# సబ్‌స్టేషన్ శంకుస్థాపన ఎప్పుడు?

- రూ.2.11 కోట్లతో మహ్మద్‌నగర్‌కు మంజూరు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో దృష్టి పెట్టని పాలకులు
- టెండర్ ప్రక్రియ పూర్తయినా ప్రారంభం కాని పనులు




మహ్మద్‌నగర్‌లో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలం

బాన్సువాడ రూరల్, ఆగస్టు 11 : కామారెడ్డి జిల్లా మహ్మద్‌నగర్ మండల కేంద్రానికి గత ప్రభుత్వ హయాంలో రూ.2.11 కోట్లతో మంజూరైన 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ఇప్పటి వరకూ ప్రారంభం కాలేదు. నిజాంసాగర్ మండల కేంద్రంలో ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మహ్మద్‌నగర్, నర్వ, గున్కులు, బూర్గుల్ గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతున్నది. అధికలోడ్ ప్రభావంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. విద్యుత్ సమస్యల పరిష్కరించాలని గ్రామాల రైతులు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, జడ్పీ చైర్‌పర్సన్ దాఫేదార్ శోభ దృష్టికి తీసుకెళ్లారు. మహ్మద్‌నగర్‌లో సబ్‌స్టేషన్ మంజూరు చేయించాలని గ్రామాల ప్రజా ప్రతినిధులు, రైతులు మొరపెట్టుకున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ గత సీఎం కేసీఆర్, విద్యుత్‌శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మాజీ ఎమ్మెల్యే హన్మంతు షిండే, జడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థన మేరకు మహ్మద్‌నగర్ గ్రామంలో రూ. 2.11 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తూ జీవోను గత ప్రభుత్వం విడుదల చేసింది. పనుల ప్రారంభానికి టెండర్లు పిలిచేందుకు అధికారులు సమాయత్తం అవుతున్న తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో టెండర్ ప్రక్రియ నిలిచిపోయింది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. సబ్‌స్టేషన్ నిర్మాణానికి మూడు నెలల క్రితమే టెండర్ల ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. నిర్మాణ పనులపై కాంగ్రెస్ పాలకులు దృష్టి పెట్టకపోవడంతో టెండర్లు పూర్తయినా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. విద్యుత్ సమస్యతో సతమతవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. నిజాంసాగర్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఎప్పుడు విద్యుత్ వస్తుందో, ఎప్పుడు పోతుందోనని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పాలకులు చొరవ తీసుకొని సబ్‌స్టేషన్ పనులను త్వరగా చేపట్టి పూర్తి చేయించేలా అధికారులపై ఒత్తిడి తెచ్చి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

**సబ్ స్టేషన్ నిర్మాణంతో తప్పనున్న తిప్పలు..**

మహ్మద్‌నగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తే తమ గ్రామాలకు విద్యుత్ సమస్య తొలగిపోతుందని అంటున్నారు. ఎమ్మెల్యే, విద్యుత్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మహ్మద్‌నగర్‌లో సబ్‌స్టేషన్ మంజూరు చేస్తూ గత ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీ

**త్వరలోనే పనులు ప్రారంభం**

మహ్మద్‌నగర్, గున్కుల్, నర్వ, బూర్గుల్ గ్రామాల్లో విద్యుత్ సమస్యను తీర్చేందుకు మహ్మద్‌నగర్‌లో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి టెండర్లు, స్థల ఎంపిక పూర్తి అయ్యింది. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. త్వరగా పనులు పూర్తి చేసి ఆయా గ్రామాలకు విద్యుత్ సమస్యను పరిష్కరిస్తాం.

**- రమేశ్‌బాబు, ఎన్‌పీడీసీఎల్ ట్రాన్స్‌కో ఎస్ఈ, కామారెడ్డి**

## చుక్కాపూర్‌లో భక్తుల సందడి



దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

మాచారెడ్డి, ఆగస్టు 11 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం కావడంతో జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకొని ఒడిబియ్యం, పట్టెనామాలు, కోరెమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు పూజలు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లను ఆలయ సిబ్బంది చేశారు.

## బీర్కూర్‌లో గైపీర్ల జాతర




బీర్కూర్‌లో గైపీర్ల వద్ద ట్యాంకును ప్రారంభిస్తున్న నాయకులు

నస్రుల్లాబాద్, ఆగస్టు 11 : బీర్కూర్‌లో ముస్లింలు ఆదివారం భక్తి శ్రద్ధలతో గైపీర్ల జాతర నిర్వహించారు. గ్రామం నుంచి గైపీర్ల వరకు చాదర్‌ను తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తుల సౌకర్యం కోసం మినీ వాటర్ టాంకును ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘు, నా యకులు సందీప్, శశికాంత్, గంగారాం తదితరులు ఉన్నారు.

## జనగామలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పండ్లు పంపిణీ చేస్తున్న తిమ్మయ్యగారి రజనీ-సుభాష్‌రెడ్డి దంపతులు

బీబీపేట్, ఆగస్టు 11: మండలంలోని జనగామ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం ఆయన స్వగృహం వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 150 మంది రక్తదానం చేశారు. వీరికి తిమ్మయ్యగారి రజనీ-సుభాష్‌రెడ్డి దంపతులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నగర్‌ను ప్రకృతి నగరంగా మార్చాలి



మొక్కను నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి, ఆగస్టు 11 : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని 17వ వార్డులో ఉన్న ప్రగతినగర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో కలిసి మొక్కను నాటారు. ప్రగతి నగర్‌ను ప్రకృతి నగరంగా మార్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివ కృష్ణమూర్తి, వనిత రాంమోహన్, చాట్ల వంశీ, నాయకులు జూలూరి సుధాకర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## రెడ్డి సంఘం ప్రారంభం

కామారెడ్డి, ఆగస్టు 11 : కామారెడ్డి జిల్లా దోమకొండలో గతంలో ఇచ్చిన మాట ప్రకారం నిర్మించి ఇచ్చిన నూతన రెడ్డి సంఘ భవనాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా మహిళా మోర్చా ఇన్‌చార్జిగా సంధ్య

రాజంపేట్, ఆగస్టు 11 : రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామానికి చెందిన బక్కి సంధ్య ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆమెకు మెదక్ జిల్లా మహిళా మోర్చా ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

# ఫలించిన మాదిగల మూడు దశాబ్దాల కల

**ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతా రావు**



పెద్దతక్కడ్‌పల్లిలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బిచ్కుంద, ఆగస్టు 11: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని సుప్రీం కోర్టు ప్రకటించడంతో మాదిగల మూడు దశాబ్దాల కల నెరవేరబోతున్నదని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బిచ్కుందలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభలో జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డప్పు చప్పుళ్ల మధ్య ర్యాలీ నిర్వహిస్తూ.. సభా స్థలికి చేరుకున్నారు. వర్గీకరణ విషయంలో బీజేపీ నాయకుల కృషి ఏమీ లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో చేపడుతున్న ఉద్యోగ నియామకాల్లో మాదిగ, మాదిగ ఉపకులాల రిజర్వేషన్ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారని గుర్తుచేశారు. అంతకుముందు పెద్ద తక్కడ్‌పల్లి గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. జాతీయ స్థాయిలో రాణిస్తున్న తక్కడ్‌పల్లికి చెందిన ప్రతిభకు శాలువా కప్పి సత్కరించారు. ఎంపీ సురేశ్ షెట్కార్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణతో ఎవరికీ అన్యాయం జరుగదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లికార్జున్ అప్పా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యక్షుడు రవిపటేల్, నాయకులు నాగ్‌నాథ్ పటేల్, విఠల్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు తుకారాం, భూమయ్య, మాదిగ దండోరా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలకు రక్షణ కరువు




గాంధారిలో డివైడర్ మధ్యలో నాటిన మొక్కలను తింటున్న మేకలు

గాంధారి, ఆగస్టు 11: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న రోడ్డు డివైడర్‌లో ఇటీవల అధికారులు మొక్కలను నాటించారు. నాటిన మొక్కలకు ట్రీ గార్డులు కూడా ఏర్పాటు చేసినప్పటికీ, వాటిని మేకలు యథేచ్ఛగా తింటున్నాయి. గ్రామంలో కొందరు పెంచుకుంటున్న మేకలను నిత్యం రోడ్లపైకి వదిలేస్తున్నారు. దీంతో రోడ్ల వెంట నాటిన మొక్కలతోపాటు ఇంటి పరిసరాల్లోని పూలు, పండ్లు, కూరగాయల మొక్కలను తింటున్నాయి. ఇప్పటికైనా మేకలు యజమానులు వాటిని రోడ్లపైకి వదిలిపెట్టకుండా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మిషన్ భగీరథ నీటి శాంపిళ్ల సేకరణ



శాంపిళ్లను సేకరిస్తున్న మిషన్ భగీరథ అధికారి

నాగిరెడ్డిపేట, ఆగస్టు 11: మండలంలోని తాండూర్, రాఘవపల్లి గ్రామాల్లో ఆదివారం మిషన్ భగీరథ నీటి శాంపిళ్లను సేకరించినట్లు మిషన్ భగీరథ ఏఈ వినోద్ తెలిపారు. రెండు గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అవుతున్న నీళ్లను పది ఇండ్ల చొప్పున సేకరించామని చెప్పారు. నీటిని నాణ్యత పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నీటి పరీక్షల నిపుణులు వెంకటేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సోయా పంటకు పచ్చపురుగు బెడద



డోంగ్లీ, ఆగస్టు 11: మండలంలో సుమారు ఏడు వేల ఎకరాల్లో సోయా పంట సాగుచేస్తున్నారు. పంట ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్నది. దీనిపై పచ్చ పురుగు ఆశించిందని రైతులు తెలిపారు. ఎన్ని క్రిమి సంహారక మందులు వాడినా పురుగు ఉధృతి తగ్గడం లేదన్నారు. వ్యవసాయాధికారులు స్పందించి సోయా పంటను పరిశీలించి, నివారణ చర్యలు తెలియజేయాలని రైతులు కోరుతున్నారు.

## నేడు పోచారం ప్రాజెక్టు

# ఆయకట్టు రైతుల సమావేశం

నాగిరెడ్డిపేట, ఆగస్టు 11: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు (సోమవారం) ఉదయం 11 గంటలకు పోచారం ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కాలువ నీటి విడుదలపై నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల రైతులతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రధాన కాలువ వద్ద 16ఫీట్ల నీరు రావడంతో ప్రాజెక్టులో ఒక టీఎంసీ నీరు నిల్వ ఉన్నదని తెలిపారు. దీంతో ప్రధాన కాలువ కింద పంటలు సాగుచేసుకుంటున్న రైతులతో సమావేశం ఏర్పాటుచేసి నీటి విడుదల విషయమై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశానికి మండలస్థాయి అధికారులు, ఆయా పార్టీల నాయకులు, రైతులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

# కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులు



మత్తడికిందిపల్లిలో కొనసాగుతున్న మట్టి పనులు

లింగంపేట, ఆగస్టు 11: లింగంపేటలోని మత్తడి పోచమ్మ ఆలయానికి రహదారి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. మత్తడికిందిపల్లి నుంచి పోచమ్మ ఆలయం వరకు రహదారి నిర్మాణానికి రూ.రెండు కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. పనులను జూలై నెలలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ప్రారంభించారు. గ్రామ శివారు నుంచి ఆలయం వరకు మట్టి పనులను చేపడుతున్నారు. ఆలయానికి మండలంలోని ఆయా గ్రామాల వారే కాకుండా జిల్లా నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. వర్షాలు కురిసిన సమయంలో ఆలయానికి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. మంజూరైన నిధులతో బీటి రోడ్డుతోపాటు సీసీ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. రోడ్డు పనులు పూర్తయితే రాకపోకల ఇబ్బందులు తీరనున్నాయి.

## రైతులకు అందుబాటులో యూరియా



పోతాయిపల్లి గ్రామంలోని గోదాములో నిల్వ ఉన్న యూరియా బస్తాలు

లింగంపేట, ఆగస్టు 11: లింగంపేట సహకార సంఘం పరిధిలోని ఆయా గ్రామాల రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉన్నదని సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వానకాలంలో రైతులు సాగు చేస్తున్న పంటలకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచామని అన్నారు. లింగంపేట సహకార సంఘం పరిధిలోని పోతాయిపల్లి గ్రామంలో ఉన్న గోదాంలో 560 బస్తాలు, లింగంపేట గోదాంలో 1,810 బస్తాల యూరియా నిల్వ ఉన్నదన్నారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, యూరియా బుక్ తీసుకురావాలని సూచించారు. ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

## ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో పిచ్చిమొక్కలు



గాంధారి ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాల పరిసరాల్లో పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు

గాంధారి, ఆగస్టు 11: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పిచ్చి మొక్కలతో పాటు గడ్డి ఏపుగా పెరిగింది. దీంతో అక్కడ పరిస్థితి భయంకరంగా మారింది. గాంధారి ఎంపీడీవో, తహసీల్, ఎంఈవో, ఐకేపీ, ఉపాధి హామీ కార్యాలయాలు అన్నీ పక్కపక్కనే ఉన్నాయి. వీటి చుట్టూ దట్టమైన పొదలు, పిచ్చి మొక్కలు పెరగడంతో విష పురుగులు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పెరిగిన పొదలు, పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఉపాధి పనుల్లో ఇష్టారాజ్యం

**రసాభాసగా సామాజిక తనిఖీ వేదిక**

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 11: ఉపాధి హామీ పనులను ఇష్టారాజ్యంగా నిర్వహించారని, పనిచేయని వారికి కూడా హాజరు వేశారని గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. మండలంలోని చిన్నదేవీసింగ్, పెద్ద దేవీసింగ్, కాటేపల్లి తండాల్లో 2023-24 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై ఆదివారం గ్రామ సభను నిర్వహించారు. తాము పనిచేసినా.. డబ్బులు రాలేదని కాటేపల్లి తండా గ్రామ పంచాయతీ కార్యదర్శి సుధీర్‌తో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. పనిచేయని వారికి కూడా హాజరు వేసి, డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. సామాజిక తనిఖీ బృందం అధికారిణి రమ్య మాట్లాడుతూ.. మేట్లు వారి సంబంధీకులు, వృద్ధులకు హాజరు వేసి డబ్బులు తీసుకున్నారని తెలిపారు. హైదరాబాద్, మహారాష్ట్రలో ఉండే వారికి కూడా పనిచేసినట్లు హాజరు వేసి డబ్బులు తీసుకున్నట్లు రాత పూర్వకంగా తనిఖీ బృందానికి అందజేశారు. మొత్తం రూ.4లక్షల32వేల బిల్లులకు గాను రూ.లక్షా14వేలకు సంబంధించిన మస్టర్లు తనిఖీ బృందానికి అందజేయగా.. మిగిలిన డబ్బుల వివరాలు అందజేయలేదన్నారు. కార్యక్రమంలో సామాజిక తనిఖీ బృందం బాధ్యులు మంజుల, సుజాత పాల్గొన్నారు.



కాటేపల్లి తండాలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో గ్రామస్తుల వాగ్వాదం

**నాకు డబ్బులు రాలేదు..**



మా కుటుంబంలో అందరం ఉపాధి పనులు చేశాం. కానీ మాకు పైసలు రాలేదు. సార్లను అడిగితే మాకు తెలువదని అంటున్నరు. పనిచేయని వారికి హాజరు వేసి డబ్బులు ఇచ్చిండ్రు. అధికారులు స్పందించి చేసిన పనికి డబ్బులు ఇప్పించాలి.

*- బర్దావల్ దేవీసింగ్, కాటేపల్లి తండా*

# మక్క బుట్టలకు భలే గిరాకీ



ఎల్లారెడ్డిలో మక్కబుట్టలను విక్రయిస్తున్న వ్యాపారులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 11: ప్రస్తుత వానకాలం సీజన్‌లో మక్క బుట్టలకు భలే గిరాకీ ఏర్పడింది. దీంతో చిరు వ్యాపారులు ఉపాధి పొందుతున్నారు. సీజన్ ప్రారంభంలో సాగు చేసిన మక్క పంట ప్రస్తుతం చేతికి అందడంతో విక్రయాలు ఊపందుకున్నాయి. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఉన్న ఆయా గ్రామాల్లో సాగుచేసిన మక్క బుట్టలను వ్యాపారులు ఇక్కడకు తీసుకువచ్చి విక్రయాలు చేపడుతున్నారు. స్థానికులు బుట్టలను కొనుగోలు చేసి కాల్చి, ఉడకబెట్టి విక్రయిస్తున్నారు. ఒక్కో బుట్టను కాల్చి 15 నుంచి 20 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. దీంతోపాటు ఉడికించిన స్వీట్ కార్న్ బుట్టను రూ.20కి ఒకటి చొప్పున విక్రయిస్తున్నారు. కూలి పనులు లేని సమయంలో ఎల్లారెడ్డిలో సుమారు 25 మంది వరకు బుట్టలు కాల్చి అమ్ముతున్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ ప్రాంతం నుంచి ఎల్లారెడ్డి చౌరస్తా వరకు బుట్టల విక్రయాలు సాగుతున్నాయి. రోజుకు సుమారు వెయ్యి రూపాయల వరకు గిట్టుబాటు అవుతుందని విక్రయదారులు తెలిపారు.

## బజరంగ్ దళ్ గోరక్షక్‌గా తులసీదాస్



ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు11: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన తులసీదాస్ బజరంగ్‌దళ్ జిల్లా గోరక్షక్‌గా నియమితులయ్యారు. ఆయన నియామకంపై స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ సందర్భంగా తులసీదాస్ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వహిస్తానని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## చెరువులో పడి యువకుడు మృతి



ప్రభాకర్(ఫైల్)

నిజాంసాగర్, ఆగస్టు 11: ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని నర్సింగ్‌రావుపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నంగి ప్రభాకర్(27) తమ గేదెలను కడగడానికి చెరువుకు తీసుకెళ్లాడు. చెరువులో దిగిన అతడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.